# కొడిగట్టిన దీపాలు

అది అక్టోబరు నెల చివరి వారం.

అంతకు క్రితం రెండు రోజుల నుండి ఆకాశం మబ్బు పట్టి అంతకు క్రితం రోజు సాయంత్రము నుండి సన్నని వాన పడ నారంభించింది. ఆ రోజు ఉదయం గాలితోడ్పడింది వానకు. ఉదయంవేళ ప్రారంభమైన గాలీవానా సాయంత్రానికి ఉధృత మైంది.

రేడియో ఏదో చెప్పిందట ఆ రోజు ఉదయం.

అసలు రేడియో చాలా విషయాలు చెపుతూ ఉంటుంది. కానీ వినేవాళ్లే లేక్కువ. వినగలిగేవాళ్ళు చాలా తక్కువ. తని విన నోచని వాళ్లు మాత్రం చాలా ఎక్కువ. బంగాళాఖాతంలో వాయు గుండం ఏర్పడిందని, ఆ గాలులు ఆ సముద్రతీర ప్రాంతం మీదుగా పయనించి పోగలవని అందరూ వినలేదు. ఆ వూరిమీదుగా. ఆ పూరిళ్ళమీదుగా ఆ గాలులు ప్రయాణిస్తాయని వూహించిన వారు చాలా తక్కువ. వారి నుండి కొందరు విన్నారు. విన్నవాళ్ళ

చాలా మంది ఉన్నారు. చంచమ్మగాని, దాని కొడుకు కుంటి రంగడుగాని, వాడి తమ్ముడు కాసులుగాని వినలేదు.

కాని వచ్చే గాలుల భావం అందరికీ తెలుసు. వచేగాలుల తీవ్రత అందరికీ తెలుసు. గాలి పాడిన పాట అందరూ విన్నారు. అది వానకాదు. ఒట్టి గాలీకాదు పెరశిగాలివానకాదు. అసలు సిసలు తుఫాను.

అది తుఫాను అనే అర్థం చేసికుంది, గోనెపట్టామీద మెడ వరకు చిరుగుల దుప్పటిని కప్పుకుని గాలిలో రెపరెపలాడుతూ వెలుగుతున్న బుడ్డీ దీపాన్ని చూచి, గాలిని వింటున్న చంచమ్మ, మలేరియా జ్వరంలో బాధపడుతూ. చలికి వణుకుతు. ఆమెకు కొంత దూరములో అదే రకపు గోనెపట్టామీద సన్నని కుంటికాళ్ళను కడుపుకి దగ్గరగా తెచ్చుకుని తమ్ముడి రాక కోసం ఎదురుచూస్తున్న రంగడితోకూడా చంచమ్మ అదే విషయాన్ని చెప్పి, అది తుఫానని ధృవ పరచింది.

అప్పటికే రాత్రి ఎనిమిది గంటలయింది. ఏడు గంటలకే వచ్చే కాసులు అప్పటికీ రాలేదు. కడుపులో ఆకలి కరకర మన సాగింది రంగడికి. తల్లినేదో అడగబోయాడు. కాసులు కోసం ఎదురుచూచే ఆమె కళ్ళలోని అవేదనను చూచి ఆగిపోయాడు. నాలుగు నెలల పొద్దయి మలేరియా జ్వరంతో మూలబడిన చంచమ్మ కదలలేనిదై, సంసారాన్ని ఈదలేని అసమర్థురాలై మూలుగుతున్నప్పుడు, చిన్న వయసులో నున్న కాసులు బసు స్టాండులో మూటలు మోసి ఇంటిని నడుపుతుంటే, తనఅసమర్థతను తలచుకునికుమిలిపోయే ఆమెలో చలరేగే సంఘర్షణ రంగడికి తెలియునిదికాదు. ఆమెలో రగిలే బాధ వాడికి అర్థంకాకపోలేదు. తాను బతికి ఏం చేయగలడనే నిస్పృహ, తను తన పిల్లలకు

ఏ రకంగా సహాయికారి కాదన్న భావాలు పంచమ్మలో ఉన్న సంగతి మాత్రం వాడికి తెలియదు. నడువ కాళ్ళులేక్ని, ఎవరికీ ఉప యోగ పడని, తనలాంటి వాళ్ళు ఎందుకు బతికి ఉండాలో వాడికి తెలియదు. అసలు తనలాంటి వాళ్ళను దేవుడెందుకు సృష్టిస్తాడో వాడికి తెలియదు.

కాని వాడికి ముఖ్యంగా తెలిసింది ఒకటి. ఉంది ఆకలైనప్పుడు "వోయమ్మో! ఆకలే!" అని అనటం. అదికూడఅన్ని వేళల కాదు ఆమెలో ప్రశాంతత ఉన్నప్పుతే. ఒక్కొక్కపుడు వాడి అంచనా తప్పవుతుం . ఆ సమయంలో తల్లి ఏ మంటుందో! ఏమని తిడుతుందో వాడికి తెలుసు. "వోరి యదవ సచ్చినోడా! తిండంటే నా నేడ తెచ్చేదిరా? నా నేమన్నా సంపాయిస్తున్నాన్రా? ఈ చలి జ్వరం నాపేనాలు తీసుదావుంటే నానే ఇంటికాడి కెళ్లెదిరా? మాయి సచ్చినోడా? తమ్ముడు సంపాయిస్తా ఉంటే గదట్రా తింటూ వుంది. పొద్దులేచింది సాలు "ఆకలో! ఆకలో!! అంటే నా నేడ సవ్వన్రా? దొంగసచ్చినోడ! సవ్వన్న సవ్వవు గదంట్రా? యదవసచ్చినోడా నీ!" ఈ రకంగా సాగిపోతాయి ఆమె తిట్లు. కాని అది నిజంగా కోపంకాదని, అలాంటి కోపం ఎంతోకాలం ఉండదని వాడికి తెలుసు. ఆమె కోపం అంతలోనే కరగిపోతుంది. కన్నీరు పెట్టుకుని, అంత చలితో బాధపడుతూ. లేచివచ్చి కౌగలించుకుని భోరున ఏడుస్తుంది.

"ఎదవ సచ్చినదాన్ని ఎన్ని మాటలన్నాను. నా జివ్వాడి పోనాది కాదు యదవ బతుకు! కన్నపిల్లలకి కూడెట్టలేని బతుకెందుకు? సవ్వన్నారాదు సావనియ్యదు బతకనీయదీ మాయదారి రోగం" అని ఆమె దుఃఖంతో కుమిలిపోవడం వాడికి తెలుసు.

తల్లి తిడితే ఏడుపొస్తుంది వాడికి. తల్లి ఏడ్చినాఎడుపొస్తుంది వాడికి. అసలు తన బతుకును చూచుకుంటేనే ఏడుపొస్తుంది వాడికి,

తొడవరకు బలిష్ఠంగా ఉన్న సన్నబడి ఎముకకు అతుక్కొని వ్రేలాడే కాళ్ళు, దెయ్యపు పాదాలులా మెలితిరిగిన పాదాలు, నల్లని శరీరం, చిన్నతనంలో నుదుటను చుట్టను కాల్చిపెట్టగా ఏర్పడిన నల్లని మచ్చ, చెప్పుకోలేని దైన్యం– అన్నీ అతనిలో ప్రోవుపడి ఉండగా, ఏడ్వడానికి వీలుకాని బాధతో, గజ్జికుక్కలాగ, పెంటమీద పురుగులాగ ఉన్న తనకా జీవితాన్ని దేవుడెందు కిచ్చాడో వాడికి అర్థం కాలేదు. అసలు అలాంటి జీవితాన్ని ఏంచేసి కోవాలో అర్థం కాలేదు వాడికి.

బలమైన కాళ్ళతో, ఆడుతూ పాడుతూ, పోయే తనలాంటి పిల్లలంటే వాడికీ ఈర్ష్య, పద్నాలుగేళ్ళు నిండని తన జీవితంలో అంతటి దీనమైన పరిస్థితి రాసిపెట్టి ఉన్నందుకు వల్లమాలిన దుఃఖం, బాధవాడిలో సుడులు తిరుగుతాయి. “వాళ్ళ కాళ్ళెందుకు బలంగా ఉండాలి? తన కాళ్ళెందుకు బలహీనములై ఉండాలి? అది వాడి బాధ. కాని అంత దుఃఖంలోనూ తన తమ్ముడు తనలాగ లేనందుకు, పైగా బలిష్టంగా ఉన్నందుకు వాడికిఆనందం. కాసులే వాడి బలం. తన తమ్ముడిని చూచి ఆనందపడతాడు. గర్వపడు తాడు. తమ్ముడు కనిపిస్తే దృష్టిని పొందిన కబోదిలా ఆనంద పడతాడు.

రహస్యంగా తల్లి చూడకుండ తనకాళ్ళవైపు చూచు కుంటాడు. మెలితిరిగిన తన పాదాల నిమురు కుంటాడు, బలహీన మైన తన కాళ్ళను తదేకంగా చూచుకుంటూ కూర్చుంటాడు. ఒకొక్కప్పుడు వాడి కాళ్ళు, అందరి కాళ్ళలాగ బలిష్టంగా ఉన్నా యనిపిస్తుంది వాడికి. క్రింది పెదవిని పళ్ళతో బిగపెట్టిరహస్యంగా లేచి నిలబడాలని నడవాలని ప్రయత్నిస్తాడు.

రంగడు గోడను పట్టుకుని లేవడం, పడిపోవడం కళ్ళారా చూస్తూ అలాంటి ప్రయత్నమేదీ చేయవద్దని చెప్పాలనుకొని నీరసం మీద చెప్పలేక నేలమీద పడిపోయిన రంగడిని చూసి కన్నీరు పెట్టుకుంది చంచమ్మ. ఒంట్లో ఏ మాత్రం శక్తి ఉన్నా వచ్చి లేవదీస్తుంది. అప్పటికప్పుడే నీరసం వచ్చేస్తే కోపంమీద రంగడిని దావబాదేస్తుంది. తిడుతుంది. తరువాత భోరుని ఏడుస్తుంది. అదంతా రంగడికి మామూలే. తల్లి తిట్టిన తిట్లు, కొట్టిన దెబ్బలు, వాడిని బాధించలేకపోయినా ఆమె ఏడుపు మాత్రం వాడి గుండెల్ని పీల్చి పిప్పిచేస్తుంది.

"నాను సచ్చిపోతాను బగవంతుడా! నన్ను తీసికెల్లిపో!" అని దేవుని కోరుకుంటాడు రంగడు. మవునంగా ప్రార్థిస్తాడు. దేవుడు వాడి ప్రార్థన ఏంతవరకు విన్నాడో వాడికే తెలియదు. వాడు మాత్రం ప్రార్థనల మూగగానే చేయాలి. చంచమ్మ వింటే వూరుకోదు. తిట్టదు. కొట్టదు. తలబాదుకుని ఏడుస్తుంది. తల్లి ఏడుస్తుంటే వాడి గుండె ఏమిటో అయిపోతుంది. తల్లితో పాటు ఏట్చేస్తాడు.

"మాయమ్మ యాడవ కూడదు"– అని వాడి నిశ్చయం.

"నేను సచ్చిపోతే మాయమ్మ ఏడవదూ? ఏడుస్తాది." ఆలోచన వచ్చినప్పుడల్లా వాడి గుండె గుభిల్లుమంటుంది."మాయమ్మ, మాయమ్మ, ఏడిస్తే నాను సూడగల్నా? సూసియాడకండ ఉండగల్నా? మాయమ్మ ఏడిస్తే నా కేడుపొస్తాది. నానేడిస్తే మాయమ్మ ఏడుస్తాది. ఇంకెట్టా ఏడవటం బగమంతుడా?"– ఏడుపొస్తోంది వాడికి. తాను చచ్చిపోయిన తరువాత తన తల్లి ఏడ్చినా తాను చూడలేడన్న సత్యం తన్నా. తను చచ్చిపోయిన తరువాత తన తల్లి

తనకోసం బ్రద్దలయ్యేలా ఏడుస్తుందన్న సత్యంమాత్రం వాడికి చావుకన్నా. తన దీనావస్థకన్నా, కఠిన క్రూరంగా ఉంటుంది.

"నాను సచ్చినా అమ్మేడుస్తాది. నాను బతికున్న అమ్మేడుస్తాది. ఇంకెట్టాసవ్వడం బగమంతుడా?" -ఆలోచనలో పడతాడు వాడు. "నాను సచ్చిసవ్వను. మాయమ్మకోసం బతికుంటా. నాను సవ్వను" -అనుకుంటాడప్పుడప్పుడు.

"కనక మాలచ్చిమి గుడికాడకో ఎంకటరమణమూర్తి గుడికాడికో నన్ను తీసికపోరా తమ్ముడూ? నేను అందర్లాగొడ్డసర్చుకొని సంపాయిస్తాను" అన్నాడొకసారి వాడు కాసులతో. తండ్రి బ్రతికున్న రోజుల్లో, తల్లితండ్రి తీసికెడితే వెంకటరమణమూర్తి గుడికెడుతూ, తల్లిచంకల్లో నుండి. కుంటోళ్ళను, గుడ్డోళ్ళను వారి ముందు డబ్బులు వేసేవాళ్ళను చూశాడు. వాడి హృదయ ఫలకం నుండి చెరిగిపోని అదృశ్యం వాడికి జీవితం మీద ఆశ కలిగిస్తూ ఉంటుంది.

కానివాడి కోరిక మాత్రంకాసులకి నచ్చలేదు. "వోరన్నియా! నీకిదేం బుద్ధిరా? నానేటై పోనానా! ముష్టిడుక్కోనానికి మనము ముష్టోళ్లమా? అయ్యేబతికివుంటేబంటురోత్తయినా, తాసీల్దారులాగ ఉండేటోడు. కాడా? మనమ్మకే ఈ సలిజోరం రాకపోతే నీవిసుంటి మాటలనేటోడివా? అయినా నానేటై పోనాను ఇంకెప్పుడిటువంటి మాటలనబోక. నాకు కోపమొస్తాది. ఆ!"—అని అనేవాడు కాసులు.

"మనం ముష్టోళ్లమా? కానేకాదు" అనుకున్నాడు రంగడు తమ్ముడితో అన్న మాటలను తల్లితో అనటానికి వాడికి ధైర్యంలేక పోయింది.

"అయ్యేబతికి వుంటే ........" కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. వాడికి గతాన్ని తలుచుకో బుద్ధికాలేదు.

అమ్మకే నూసుదారి జొరం రాకపోతే అమ్మిట్టాంటి మాటలనేదా? అమ్మ మంచిది. శానా మంచిది. తమ్ముడో? .... ఆడుశాన మంచోడు. ఆ కుదరమ పెబువు. ఆడే సంపాయించపోతే ఏ పోదురంతా? నానేమంచోణ్ణి కాను. ఈ కాల్లతో ఎందుకిబతుకు? సవ్వాల? ఎవరికీ తెలియని సవ్వాలా!! అమ్మకే తెలియక! సవ్వాల!..." బయటగాలి ఉద్రుతంగా వీస్తూంటే చావాలనే కోరిక బలీయకమైంది. వాడిలో.

అంతలో వాడి కడుపులో ఆకలి కరకరలాడింది. "అమ్మా ఆకలే." —నోటిదాక వచ్చింది,

కానితల్లి ముఖం చూస్తే వాడికా మాటలనాలని లేదు.

ఎడతెరిపి లేని తుఫానులో, కాసులు పన్నెండు దగ్గర డబ్బు సంపాదించాలన్న దృష్టితో ఎంత యాతన పడుతున్నాడో ఏమవుతున్నాడో, అని చంచమ్మ తల్లడిల్లి పోతుంది. ఆమెకాకలి మీద దృష్టి లేదు. గానివీస్తున్నప్పుడల్లా కాసులేమైపోయాడో అనే బాధ ఆమె గుండెల్లో సుడులు తిరగసాగింది.

గాలి తీవ్రంగా వీస్తుంది. వర్షంకూడ గాలికి వంతపాడుతునే ఉంది. తొమ్మిది గంటల వేళయినా కాసులు రాలేదు.

చంచమ్మ ప్రక్కమీదనుండి లేవాలని, తలుపు వరకు వెళ్ళి, కొడుకు వస్తున్నదీలేనిదీ చూడాలని తాపత్రయ పడుతోంది.

రంగడు ఆకలిని ఆపుకోలేక పోయాడు.

నెమ్మదిగా తల్లి దగ్గరకూ డేక్కుకుంటూ వెళ్ళాడు. మధ్యాహ్నం ఆమె తినగా మిగిలిన ఎండు రొట్టిముక్క ఉంటుందేమో అని ఆశ. ఆ ముక్క మిగలలేదన్న సంగతి వాడికి

తెలియదు. "అమ్మా! ఆకలే!" అన్నాడు రంగడు. కాసులు రాలే దన్న బాధతో నలిగిపోతున్న చంచమ్మ. తన ఆవేశాన్ని అపుకో లేక పోయింది. రంగడు తన్నులు తప్పించుకొనలేక పోయాడు. "యుదవసచ్చినోడాని! తమ్ము డానేదన్న బాధనేదుగాని, తిండి గావల్సి వచ్చినాదిరా! తిండి! మాయసచ్చినోడానీ! నాను సచ్చి న్నాడుగానీ నీకు ఆకలిపోదురా! యుదవకానా!..." ఆవేశంతో తిట్టుకుంటూ పోతోంది చంచమ్మ.

"రంగడికళ్ళల్లో నీళ్లు తిరిగాయి. తల్లి తిట్టినందుకుకాదు. కొట్టినందుకుకాదు. తుఫాను తీవ్రంగా ఉన్నపుడు తన తమ్ముడి గురించి ఆలోచించక ఆకలి గురించి ఆలోచించినందుకు. అసలు తమ్ముడేపోయాడో అనే ఆలోచన తన బుర్రకు రానందుకు ఏడిచాడు రంగడు.

రంగడి బాధ అర్థమైంది చంమ్మకు. దుఃఖాన్ని పట్టలేక పోయింది. గబుక్కున రంగడిని అక్కున చేర్చుకుంది. తలనిమిరి, ఒళ్ళు నిమిరి ఏడ్చింది. తనచేతగానితనానికి తన్ను తానుతిట్టుకుంది. కొంతసేపు రంగడ్ని పట్టుకొని ఏడిస్తేగాని బాధతగ్గలేదు. రంగడు తల్లికళ్ళు తుడిచి తనకళ్ళు తుడుచుకున్నాడు. ఏడ్వవద్దని బ్రతిమి లాడాడు. ఆమెకళ్ళు పూర్తిగా తుడుచుకోగానే ఆమె ఒడిలో తల దాచుకొని ఉండిపోయాడు. అప్పటికి వాడుఆకలిని మరచిపోయి చాలా సేపయింది.

నిశ్చలనే తాలతో చూస్తూకూర్చుంది వీధివైపు చంచమ్మ తుఫాను। గాలివెంటా తలుపు తోసుకుని ఇంటిలోకి ప్రవేశించాడు కాసులు. తలమీదనుండి నీరు ధారా పాతమై ప్రవహిస్తుంటే తలుపుదగ్గర నిలబడి గడగడ వణిపోతూ అక్కడనుండే చొక్కా వెనుకనుండి పొట్లాలను తీసి తల్లికందిస్తూ నిలబడ్డాడు కాసులు.

తమ్ముడిని చూశాడు రంగడు. పోయినదేదో దొరికినట్టు యిందివాడికి.

"పోయమ్మా తముడొచ్చేసి నాడే! తమ్ముడు" అంటూ ఆనందంగా కేకవేశాడు. లక్షరూపాయలు లాటరీలో తెచ్చుకొన్న వాడి ఆనందంకన్నా ఏమాత్రం తక్కువకాదు వాడి ఆనందం.

అన్నను చూచి ఆప్యాయంగా నవ్వాడు కాసులు. అక్కడ నుండే చేతులు ముందుకు చాచి "అమ్మా! ఇదిగోనే నీకు రొట్టి, మాతుపప్పులు సన్నం. ముంగల. పట్టుకో. తడిసిపోతుంది." అన్నాడు కాసులు. చంచమ్మ వాటినందుకుంది.

దీపం బుడ్డీ ముందు పప్పులు సన్నం పొట్లాలని విప్పుతూ "రంగా! రా; రా." పిలిచింది చంచమ్మ.

"తమ్ముడానియ్యే! ఆడూ నానూ కలిసే తింతాం! వోర తమ్ముడా! తడిగుడ్డలిప్పేయారా?" అంటూ డేకురు కుంటూ వెళ్ళి మూతవూడిన ఒక పాకేజి పెట్టెలోనుండి ఉతికి ఆరేసికున్న తన చొక్కా లాగూ తీసి డేకురుకుంటూ వెళ్ళి కాసులు కందించాడు. కాసులు చూడకుండా కన్నీరు తుడుచుకుంది చంచమ్మ.

కాసులు తడిచొక్కాను వీధిలో పిండుకొని తలతుడుచుకొని రంగడు యిచ్చిన వాడిబట్టలు కట్టుకుని, పెద్దమగాడిలా జుత్తును పైకి ఎగదువ్వుకుని "రా! రా! అన్నయ్యా" అంటూ రెండు సత్తుగిన్నెల ముందేసుకుని కూర్చున్నాడు. చంచమ్మ ప్రక్క మదే కూర్చుని పప్పులు సన్నం ఇద్దరికీ సత్తుగిన్నెల్లో వేసి వారి ముందు వుంచింది.

భోజనం చేస్తూ తన ఆలస్యానికి కారణం చెప్పాడు కాసులు.

"గాలివానపేత లాష్టు బస్సురానేదు. వస్తాదేమో అని ఆశ. బలపచ్చీడానికి మనసుగానేదు. ఆవలిసుంటి రోజుల్లోనే ఎక్కువ కూలీ కిడుద్ది. అందుకేబస్సుకోసరం ఉండిపోనాను. రిక్షసాం" వెటికయ్యే సద్దుకున్నాయి. నాను మరిద్దరమే మిగిల్నం. బస్సు రానేదు గాని స్టాండుకాడి నుండి ఒటేలుంద సూడూ అక్కడున్నండి ఒక పెట్టె మోయించినాడు. నడిపించి నాది తక్కువ దూరమైనా రూపాయి డబ్బులిచ్చాడు" అన్నాడు. అంతలో ఏదో జ్ఞాపకం వస్తే లేచి ఆరేసిన చొక్కా జేబులోంచి రూపాయి నోటును తీసి తల్లి చేతిలో పెట్టి ఇయ్యాళకిది మిగిలినాది" అన్నాడు కనుబొమ్మలెగరేస్తూ. అంత ఎక్కువ మొత్తం మిగల్చటం అదే మొదటిసారి వాడికి. కాసులు తల నిమిరింది చంచమ్మ ప్రేమతో.

అన్నం తినటంముగిరంచి ఇద్దరూచేతులుగిన్నెల్లో కడుగుకున్నారు. గిన్నెల్ని ఒకమూలకు సర్దాడు కాసులు. ఇద్దరూ చెరో ప్రక్కనగోడలకు చేరువుగా గోనెంకాలపర్చుకుని నిద్రకుపక్రమించారు. కాసులు నిద్రపోకకబుర్లు మొదలు పెట్టాడు.

"రోజుకు రూపాయి మిగిలిల్నాదనుకోయే అమ్మా! నెల కెంతవుద్దే?.... నెలంటే ముప్పయి రోజులే? అంటే ముప్పయి రూపాయిలవుతాది.

సమ్ముచ్చరానికో?

ఏటే అమ్మా!... సెప్పవు?... సమ్మచ్చరానికైతే బోలెడవుద్ది. రావుణ్ణి అడిగితే సెప్తాడులే! ఆడు అయిదవ తరగతి పరితులు బడిలో సదివాడంట. అమ్మా! ఆడు పద్దేలు కూడా సదువుతాడు. సినేమాలు గోడమీద సూసి ఆదీ సదివి ఆడేసెప్తాడు. ఆడికన్నీ ఎరిక. ఆవే అంటాడు... "వోరి కాసులూ! మనమెంతకాలం మూటలుమోసి నాగే బతుకులింతే కాని వోపిక పట్టాల. మరి మన

షావుకార్యు... కొడుకు లేడూ సిత్రిగాడు... ఆడు... మరి మనసాగే షోకాటలు మోసేటోడా? మరేమన్నానా? అయితే ఆడు సంపాదించుతా ఖర్చు పెట్టేలేదు. వాళ్ళమ్మకాడ దాచినాడంట. దాచే మరి.

"రిక్షా కొన్నాడు గదా?. మనం కూడ అట్టానే సెయ్యాలా!" అంటడు అమ్మా! ఇంటున్నావే! నాను కూడ రిక్షా కొనెత్తానే. అప్పుడు తోర అన్నయ్యా! అసలు నిన్ను నేలమీద నడనీను. రిక్షామీద సినిమాలకెల్తాం..." చెప్పుకో పోతున్నాడు కాసులు.

చంచమ్మ మవునంగా వింటున్నది వాడి కబుర్లను. రంగడు రంగడు వూ కొడుతున్నాడు ఉత్సాహంతో. మధ్య మధ్యన ప్రశ్నలు వేస్తున్నాడు. "ఇంత చిన్న బుర్రలో ఎంత పెద్ద వూహలున్నాయి?" చంచమ్మ కళ్ళు నీళ్ళు తిరిగాయి. ఇక ఎట్టి పరిస్థితులలోను రంగడిని కొట్టకూడదని నిశ్చయించుకొని వోపిక తెచ్చుకుని ఇద్దరికి చిరుగుల దుప్పట్లు కప్పి దీపంతగ్గించి తన ప్రక్కకు చేరింది చంచమ్మ.

మాటాడుతూ మాటాడుతూ నిద్రకొరిగాడు కాసులు. కాసులు నిద్రకొరగగానే తను గోడకు దగ్గరగా జరిగి నిద్రకుపక్రమించాడు రంగడు. చెరో గోడ ప్రక్కగా చిరుగుల దుప్పట్లలో కాళ్ళు ముడుచుకుని పరున్న ఇద్దరు పిల్లల్ని చూచి "నాను ఎద్దై పోయినా బాధలేదు. కాసులే రంగడికి కాళ్ళు. ఆడు అన్నకింత తిండి పెట్టకపోడు. ఏటో యదవ బతుకులు." నిట్టూరుస్తూ కళ్ళు మూసుకుంది చంచమ్మ.

గాలి అవతల ఏడుస్తూనే ఉంది. ఒక్కొక్కపుడు గుయ్యి గుయ్యిని శబ్దం చేస్తోంది. అప్పుడప్పుడు కొద్దిగా విశ్రాంతి తీసు

కుంటున్నది. గాలిలో గుయ్యిన్న శబ్దం అలలు, అలలుగా లేచి పడుతూంటే నేలమీది నీరు ఎత్తునుండి పల్లానికి ప్రవహిస్తూ గాలితాకిడికి కొంత లేచి పడుతుంది పైకి. గాలి తీవ్రంగా వీస్తుంటే వర్షపు జల్లులు నీటి మీది వడి తునాతునకలై, పొగ మంచులా పైకి లేచి కరిగిపోతున్నాయి. చెట్లాకులు, చెట్ల కొమ్మలు రెమ్మలు గాలిలో పల్టీలు కొడుతూ దూరంగా ఎగిరి పడుతున్నాయి.

చంచమ్మకు నిద్రరాలేదు. గుండెల్లో భయం మూలుగుతుంది. "ఈ రాత్రి గడిస్తే చాలు అని దేవుడికి దండాలు పెడుతున్నది. గాలి తీవ్రముగా వీస్తూనే ఉంది. వర్షం ఉధృతంగా పడుతునే ఉంది.

చంచమ్మ పూరింటి సమీపంలో ఉండి. ఏనాడు నేలని వంగి చూడని, కొబ్బరిచెట్ల కొమ్మలు అమ్మవారి ముందు గణాచారుల్లా జుత్తు విరబోసుకొని ఊగుతున్నాయి, చంచమ్మ. ఎదురింటికి సాలలోంచి లేగదూడలు 'అంబా!' అని అరుస్తున్నాయి. వర్షం పూచికొడుతూ వుంటే అడ్డూ ఆపూ లేని మట్టిగూడలు నేలను కూలుతున్నాయి.

సగము రాతిరి అయింది.

తుఫాను అలానే ఉంది.

చంచమ్మ మగత నిద్రలో ఒరిగిపోయింది. ఆ నిద్రలో భయంకరమైన కలనేదో కంటోందామె. ఆ నిద్రలో ఇంటిమీద ఏదోపడ్డట్టు, ఎవరో అరచినట్టు అనిపించింది. చంచమ్మకు. తళ్ళుకు బడి లేచింది. బుడ్డీదీపం గాలికెప్పుడో ఆరిపోయింది. నీటితుప్పర్లు, చలిగాలీ ఆమె చుట్టూ పరిభ్రమించసాగాయి. చుట్టూ తడుముకుంది. తాను విన్నది భ్రమమాత్రమే అనుకుంది.

అంతలో అలికిడైంది గుడిసెలో.

"అమ్మా వోయమ్మా! ఇంటి మీద ఏదో పడిరాదే!... ఎగే... దీపం ముట్టించి సూడే!.. ఇదేటమ్మా! నా సేతికి కొబ్బరాకులు తగల్తన్నాయి. వోయమ్మా ఈడంతా నీలనే!... ఒర్సమే... తమ్ముడేడున్నాడో సూడే.. సోతమ్ముడా... వోకాసులూ!.. వోరా! ... కాసులూ.,. ఎగరా..." గోల పెడుతున్నాడు రంగడు.

చెంచమ్మ గుండెజల్లుమంది. చుట్టూ తడుముకుని దీపం వెలిగించింది. ఇంటిమీద కొబ్బరిచెట్టు ఒకప్రక్కగా కూలింది. ఆ వైపునున్నగోడ కూలింది. ఆగోడ ప్రక్కనున్న కాసులు కనిపించలేదు.

అప్పటికప్పుడే కూలినగోడ దగ్గరికి డేకురుకుంటూ వెళ్ళాడు రంగడు. కూలిన గోడక్రింద కాసులు మూలుగు విన్నాదిచెంచమ్మ. ఆమె గుండెచెరువైంది. "కాసులూ!... నాకాసులూ!" కూలినగోడ వైపు పరుగు తీసింది చెంచమ్మ. బరువైన గోడక్రింద కాసులు కన్నెత్తి చూశాడు. ఆ చీకటిలో ఆగాలి ఏడ్పులో నెత్తిమీద వర్షం కుండపోతగా పడుతుంటే తల్లి స్పర్శను పొందాడేగాని తల్లిని చూడలేక పోయాడు కాసులు.

"అమ్మా" అన్నాడు బాధగా.

"కాసులూ!... వోకాసులూ!!... నాకాసులూ"... వణికే గొంతుతో పిలిచింది చెంచమ్మ. మూలుగు ఆగిపోయింది, కాసులు మాటాడలేదు. అప్పటికేకాదు మరెప్పటికీ మాటాడలేదు. తల్లిని, అన్నను చూడాలని తాపత్రయ పడ్డ అతని కళ్ళు తెరచి ఉండిపోయాయి. "వోకాసులూ!... వోకాసులూ?!. నాకాసులూ!!... నాకొడకా!.. ఒక్కసారి మాటాడురా!... వోనాతండ్రీ!...."

గుండె కొట్టుకొని ఏడుస్తూ కాసులు ముఖం మీద వాలిపోయింది చెంచమ్మ. రంగడికంతా అయోమయంగా ఉంది.

తను అమితంగా ప్రేమించే తనతమ్ముడుఅంతకు కొద్దికాలం క్రితం వరకూ ఉండి మాటాడిన తన తమ్ముడు మరి ఇకలేడంటే వాడికి నమ్మబుద్ధికాలేదు. దుఃఖం వాడిలో పొంగులు వారింది.

"దేవుడా! వోరదేవుడా? నాతమ్ముణ్ణి తీసికెళ్ళి పోయునావా? నన్నుంచీసినావా? వోమాయుదారి దేవుడా? ఎవరికీ పనికిరాని నన్నెందుకుంచీసినావు. ఆడినెందుకు ఎత్తుకెళ్ళి పోయినావు? నాను మాయమ్మ కేటి సేయగల్గును? మాయిందరికీ ఆడేదిక్కు గదా! ఆడినెందు కుంచీసినావు కావు.నన్నేల ఉంచేసినావు దేవుడా! నన్నేలుంచేసినావు? నాతమ్ముణ్ణి నాకిచ్చేదేవుడా! నన్ను తీసికెళ్ళిపో నీకు మొక్కుతా! శనివారంనాడు నీకు కొబ్బరికాయ కొట్టమని మాయమ్మకిసెప్తా! నాతమ్ముణ్ణి నాకిచ్చె దేవుడా? ఆడిబదులు, నన్ను తీసికెళ్ళిపో అమ్మా!... వోయమ్మా! నీవన్నా సెప్పే!" అంటూ తల్లిమీద వాలిపోయాడు రంగడు.

కాసులు మరణంతో పిడుగుపాటును పొందిన చెంచమ్మ ఒక్కసారి చలనం పొందినదై "రంగా. వోర... నారంగా!... నీవన్నా బతికిరా నాకొడుకా!..." అంటూ తనచేతిలోకి తీసుకుంది రంగడిని. తనలో ఏప్రయోజకత్వాన్ని చూచి తల్లి తనను యింకా బ్రతికి ఉండమంటున్నాదో తెలియని రంగడు తల్లి కడుపులో తలదాచుకుని బావురుమన్నాడు.

oo - / — / - oo